సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

బుధవారం । 10 । జూలై । 2024



టన్ను చీనీ రూ.18 వేలు
అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో మంగళవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.18 వేలు పలికాయి. మార్కెట్‌కు 706 టన్నుల చీనీకాయలు అమ్మకానికి వచ్చాయి.



కిలో టమాట రూ.36
అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్టంగా రూ.36, కనిష్టంగా రూ.26 ప్రకారం పలికినట్లు అధికారులు తెలిపారు.

గరిష్టం/కనిష్టం
34.4°/23.1°
జిల్లా వ్యాప్తంగా మంగళవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. గంటకు 8 నుంచి 12 కి.మీ వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

మాజీ ఎమ్మెల్యే సిద్దారెడ్డిపై సస్పెన్షన్ వేటు



డా.పీవీ సిద్దారెడ్డి

కదిరి: ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో పార్టీకి వ్యతిరేకంగా పనిచేసిన కదిరి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డిని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సస్పెండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం ఆ పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. సిద్దారెడ్డి పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు పార్టీ క్రమశిక్షణ కమిటీకి అనేక ఫిర్యాదులు అందాయి. వాటిపై సమగ్ర విచారణ జరిపిన అనంతరం పార్టీ క్రమశిక్షణ కమిటీ సిఫారసుల మేరకు పార్టీ అధినేత వైఎస్ జగన్ ఈమేరకు నిర్ణయం తీసుకున్నారు.

రేపటి నుంచి కంది పప్పు, బియ్యం కౌంటర్లు

పుట్టపర్తి అర్బన్: బహిరంగ మార్కెట్‌లో నిత్యావసరాల ధరలు పెరుగుతున్న దృష్ట్యా ప్రజలకు తక్కువ ధరకే అందించేందుకు జిల్లాలో నాలుగు పట్టణాల్లో కందిపప్పు, సన్న బియ్యం ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నారు. ప్రభుత్వమే హోల్‌సేల్ ప్రతినిధులతో మాట్లాడి ఈమేరకు ఏర్పాట్లు చేసినట్లు జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి వంశీకృష్ణారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 11వ తేదీ నుంచి ధర్మవరం పాండురంగ స్వామి గుడి వద్ద, హిందూపురంలో మున్సిపల్ కాంప్లెక్స్, పెనుకొండ ఎంపీడీఓ కార్యాలయం కాంప్లెక్స్, కదిరి పట్టణంలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.

ధరలు ఇలా..
కంది పప్పు బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.181 ఉండగా... రూ.160కే అందించనున్నట్లు డీఎస్ఓ పేర్కొన్నారు. అలాగే సోనా మసూరి స్టీమ్డ్ రకం మార్కెట్‌లో రూ.55.85 ఉండగా, రూ.49కు, సోనా మసూరి ఫైన్ రకం మార్కెట్‌లో రూ.52.40 ఉండగా, రూ.49కే ప్రజలకు అందజేయనున్నట్లు వెల్లడించారు.

టీబీ డ్యాంకు తగ్గిన ఇన్‌ఫ్లో



తుంగభద్ర జలాశయంలో చేరిన నీరు

బొమ్మనహాళ్: కర్ణాటకలోని హొస్పేట్ వద్ద ఉన్న తుంగభద్ర జలాశయానికి ఇన్‌ఫ్లో తగ్గింది. ఆదివారం 50,715 క్యూసెక్కులు, సోమవారం 30,388 క్యూసెక్కులు ఉన్న ఇన్‌ఫ్లో మంగళవారం ఉదయానికి 23,079 క్యూసెక్కులకు పడిపోయింది. 105.788 టీఎంసీల పూర్తి మట్టానికి గాను డ్యాంలో 22.825 టీఎంసీల వరకు నీరు నిల్వ అయ్యాయి. అవుట్‌ఫ్లో 156 క్యూసెక్కులుగా నమోదవుతోంది. 1,633 అడుగుల డ్యాం ఎత్తులో 1,600.99 అడుగుల వరకు నీరు చేరాయి. మరికొన్ని రోజుల పాటు డ్యాంలోకి వరద నీరు భారీగా వచ్చే అవకాశం ఉంది.

పింఛన్లు నిలిపేస్తారా?

- జెడ్పీ సర్వసభ్య సమావేశంలో సభ్యుల ఆగ్రహం
- సామాజిక పింఛన్ల పంపిణీలో కోతపై నిలదీత
- డిప్యూటీ సీఈఓ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈని సరెండర్ చేయాలని పట్టు
- నిధుల దుర్వినియోగంపై సమగ్ర విచారణ చేయాలని డిమాండ్



పింఛన్లు తొలిగించారంటూ ఎమ్మెల్యేలపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న జెడ్పీటీసీ సభ్యులు

అనంతపురం సిటీ: ఐదేళ్లుగా తీసుకుంటున్న పింఛన్లను కొత్త ప్రభుత్వం ఎలా నిలిపేస్తుందని జెడ్పీ సర్వసభ్య సమావేశంలో సభ్యులు నిలదీశారు. ఇప్పటికీ చాలా మంది అర్హులకు పింఛన్లు అందలేదని మండిపడ్డారు. మంగళవారం అనంతపురంలోని జిల్లా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలోని అనంతపురం, హిందూపురం ఎంపీలు అంబికా లక్ష్మీనారాయణ, బీకే పార్థసారథి, ఎమ్మెల్యేలు జేసీ అస్మిత్‌రెడ్డి, బండారు శ్రావణిశ్రీ, పల్లె సింధూరరెడ్డి, దగ్గుపాటి వెంకటప్రసాద్, ఎంఎస్ రాజు, కాలవ శ్రీనివాసులు, అమిలినేని సురేంద్రబాబు, కందికుంట వెంకటప్రసాద్, గుమ్మనూరు జయరాం హాజరయ్యారు. అనంతపురం కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్, శ్రీసత్యసాయి జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, సీఈఓ వైఖోమ్ నిదియాదేవి పాల్గొన్నారు. తొలుత ఎంపీలు, ఎమ్మెల్యేలకు జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, సీఈఓ నిదియా, డిప్యూటీ సీఈఓ లలితబాయి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఇటీవల గుండెపోటుతో మరణించిన పెనుకొండ జెడ్పీటీసీ సభ్యుడు శ్రీరాములు మృతికి సంతాప సూచకంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు.

పింఛన్ల నిలిపివేతపై ఆగ్రహం..
చైర్‌పర్సన్ గిరిజమ్మ సభను ప్రారంభించగా.. టీడీపీకి చెందిన ఎమ్మెల్యేలు, జెడ్పీటీసీ సభ్యులు కొత్త ప్రభుత్వం సామాజిక పింఛన్ల మొత్తాన్ని పెంచడంపై ధన్యవాదాలు తెలుపుతూ తీర్మానం చేయాలని కోరారు. ఈ క్రమంలోనే వైఎస్సార్‌సీపీ సభ్యులు జోక్యం చేసుకుంటూ ఇంకా చాలా మంది అర్హులకు పింఛన్లు అందలేదని తెలిపారు. చాలా రోజులుగా పింఛన్ అందుకుంటున్న వారికి ఒక్కసారిగా నిలిపివేయడంతో ఆందోళన చెందుతున్నారన్నారు. ఎంపీ బీకే కల్పించుకుంటూ 75 శాతం మందికి పింఛన్లు అందించామన్నారు. పింఛన్ల పంపిణీలో లోపాలుంటే పరిశీలించి సరిదిద్దుతామని రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ ప్రకటించారు. అర్హులకు అన్యాయం జరగనివ్వబోమని తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి పేర్కొన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ మాట్లాడుతూ జెడ్పీ డిప్యూటీ సీఈఓ లలితబాయి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఎహసాన్‌బాషాను ప్రభుత్వానికి సరెండర్ చేయాలని గత జెడ్పీ సమావేశాల్లో చేసిన తీర్మానాలకు ఇంత వరకు దిక్కులేకపోగా, ఆ తీర్మాన కాపీలను అధికారులు మాయం చేశారని మండిపడ్డారు. వైఎస్సార్ సీపీకి చెందిన దళిత జెడ్పీటీసీ సభ్యుడిని డిప్యూటీ సీఈఓ లలితబాయి అవమానించారని, ఆమెపై చర్యలు తీసుకోవాలని సభ్యులంతా పట్టుబట్టారు. సీఈఓ సైతం జెడ్పీటీసీలను చిన్నచూపు చూస్తున్నారని సభ్యులు ఆరోపించారు. ఈ అంశంపై ఎంపీలు, ఎమ్మెల్యేలు కల్పించుకుంటూ ప్రజా ప్రతినిధులు ఏ పార్టీ వారైనా, ఏ స్థాయి వారైనా గౌరవించాల్సిన బాధ్యత ప్రభుత్వ ఉద్యోగులపై ఉందన్నారు. అవమానకరంగా మాట్లాడిన వారిని క్షమించే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. కలెక్టర్ వినోద్ కుమార్ జోక్యం చేసుకొని ఈ అంశంపై విచారణ చేయించి సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ తీరుపై మండిపాటు
ఆర్‌డబ్ల్యూఎస్ అంశంపై చర్చ ప్రారంభం కాగానే.. జల్ జీవన్ స్కీం కింద ఎన్ని కోట్లు వచ్చాయి, పనులు ఎంత వరకు సాగాయి, ఇంకా నిధులు ఎన్ని ఉన్నాయని ఎంపీ బీకే, ఇతర సభ్యులు ప్రశ్నించారు. ఎస్ఈ ఎహసాన్ బాషా పొంతన లేని సమాధానాలు ఇవ్వడంతో సభ్యులు మండిపడ్డారు. ఏంటి తమాషాగా ఉందా..ఎందుకు నవ్వుతున్నారంటూ జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అసహనం వ్యక్తం చేశారు. జెడ్పీ నిధులు రూ.కోట్లకు కోట్లు ఏ విధంగా కాంట్రాక్టర్లకు దోచిపెట్టారని నిలదీశారు. శ్రీసత్యసాయి, శ్రీరామరెడ్డి తాగునీటి పథకం కార్మికుల ప్రయోజనాలను కూడా స్వాహా చేశారన్నారు. శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ కూడా డొంక తిరుగుడు సమాధానాలివ్వడంపై అధికార, విపక్ష సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు.

నకిలీ విత్తనాలు, ఎరువులను అరికట్టండి
ఖరీఫ్ సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా నకిలీ విత్తనాలు, ఎరువులు విపరీతంగా మార్కెట్‌ను ముంచెత్తుతున్నాయని, వాటిని అరికట్టాలని గుంతకల్లు జెడ్పీటీసీ సభ్యుడు కురుబ కదిరప్ప కోరారు. బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్న దృష్ట్యా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసి తమకు ఇస్తే అసెంబ్లీలో చర్చిస్తామని మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు కోరారు. దీనిపై కలెక్టర్ వినోద్‌కుమార్ స్పందిస్తూ.. 42 అంశాలతో నివేదిక రూపొందించామని తెలిపారు. ఈ నెల 11న అధికారులతో చర్చించి, నివేదిక సిద్ధం చేస్తామని శ్రీసత్యసాయి జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ వివరించారు. నకిలీ విత్తనాల ఏరివేతకు ప్రత్యేక బృందాన్ని రంగంలోకి దింపినట్లు కలెక్టర్ వెల్లడించారు.

వైద్య ఆరోగ్య శాఖపై చర్చ
వైద్య ఆరోగ్య శాఖపై చర్చ సందర్భంగా ఎంపీలు, ఎమ్మెల్యేలు, జెడ్పీటీసీ సభ్యులు తమ ప్రాంత సమస్యలను అధికారుల దృష్టికి తెచ్చారు. కుక్కకాటుకు, పాముకాటుకు మందుల్లేవని ఎమ్మెల్యే సింధూరరెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. రోడ్డు ప్రమాదాలు ఎక్కువయ్యాయని, క్షతగాత్రులను అనంతపురం పెద్దాస్పత్రికి తీసుకువస్తే కర్నూలు లేదా బెంగళూరుకు రెఫర్ చేసి చేతులు దులుపుకుంటున్నట్లు జెడ్పీటీసీ సభ్యుడు చంద్రకుమార్ ఆరోపించారు. సర్వజనాస్పత్రిలో ఒకే బెడ్‌పై 8, 10 మందిని పడుకోబెడుతున్నారని, ఆ సమస్యపై దృష్టి పెట్టాలని ఆయన కోరారు. పెద్దాస్పత్రిలో పని చేసే కొందరు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు డ్యూటీలకు డుమ్మా కొట్టి, మహిళలు, అమ్మాయిల వెంటబడుతున్నారని, వారి ఆగడాలకు కళ్లెం వేయాలని ఆయన డిమాండ్ చేశారు.



ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

> **ప్రజా సంక్షేమానికి కలసికట్టుగా కృషి చేద్దాం**
> ఎమ్మెల్యేలు, ఎంపీలు ఇచ్చే సలహాలు, సూచనలు తీసుకొని ఉమ్మడి జిల్లా అభివృద్ధికి కలసికట్టుగా కృషి చేస్తాం. త్వరలో ప్రవేశపెట్టే బడ్జెట్‌లో ఉమ్మడి జిల్లాకు రూ.200 కోట్లు కేటాయించేలా ఎమ్మెల్యేలు తమవంతు కృషి చేయాలి. అధికార, ప్రతిపక్ష పార్టీలనే తేడా లేకుండా ప్రజా సమస్యల పరిష్కారానికి, సంక్షేమానికి చిత్తశుద్ధితో పని చేద్దాం. అవినీతి అధికారులను జిల్లా నుంచి పంపిద్దాం.
> – బోయ గిరిజమ్మ, జెడ్పీ చైర్‌పర్సన్
>
> **ప్రజాప్రతినిధులను గౌరవించాల్సిందే**
> ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రతినిధులను ఏ స్థాయి అధికారైనా గౌరవించాల్సిందే. ఈ విషయంపై అన్ని శాఖల అధికారులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి గట్టిగా చెబుతా. దళిత జెడ్పీటీసీ సభ్యుడికి జరిగిన అవమానంపై విచారణ చేయించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటా. ప్రజాప్రతినిధులు ఏ కార్యాలయానికొచ్చినా కూర్చోబెట్టి వారి సమస్య విని, పరిష్కరించాల్సిందే.
> – డాక్టర్ వినోద్‌కుమార్, జిల్లా కలెక్టర్

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- ఎస్పీ మాధవరెడ్డి



ట్రేడింగ్ మోసాలు, హనీట్రాప్, సైబర్‌నేరాలపై అవగాహన కల్పించేందుకు రూపొందించిన పోస్టర్లను విడుదల చేస్తున్న ఎస్పీ మాధవరెడ్డి, పోలీస్ సిబ్బంది

పుట్టపర్తి టౌన్: సైబర్ నేరాల పట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ మాధవరెడ్డి సూచించారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని తన చాంబర్‌లో ట్రేడింగ్ మోసాలు, హనీట్రాప్, సైబర్‌నేరాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించేందుకు రూపొందించిన పోస్టర్లను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... తక్కువ పెట్టుబడితో ఎక్కువగా డబ్బు సంపాదించవచ్చని కొందరు మోసగాళ్లు నిరుద్యోగ యువతీ యువకులకు షేర్ మార్కెట్ యాప్‌ల ద్వారా వల వేస్తున్నారని, అలాంటి వారి మాటలు నమ్మకూడదన్నారు. అలాగే ఒంటరిగా ఉన్నాం....న్యూ ఫ్రెండ్ కావాలని మెసేజ్‌ల రూపంలో పంపిస్తుంటారని, అటువంటి వాటిని నమ్మకూడదన్నారు. పొరపాటున వారి మాటలు నమ్మితే.. మోసగాళ్లు న్యూడ్ వీడియో కాల్ రికార్డ్ చేసి డబ్బుల కోసం బ్లాక్ మెయిల్ చేస్తారన్నారు. ఇక కేవైసీ అప్డేట్ వంటి మోసపూరిత మెసేజ్‌లు కాల్స్ పట్ల కూడా అప్రమత్తంగా ఉండాలన్నారు. బ్యాంక్ ఖాతా వివరాలు గోప్యంగా ఉంచాలని, ఎవరైనా అప్డేట్ చేయాలని ఫోన్ చేస్తే స్పందించకూడదన్నారు. పొరపాటున ఎవరైనా సైబర్ మోసాలకు గురైతే 1930 నంబర్‌కు లేదా నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్లో ఫిర్యాదు చేయవచ్చన్నారు. అలాగే యువతీ యువకులు కార్మికులు గంజాయి మత్తులో పడి తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాలు ఎవరైనా విక్రయిస్తున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ విష్ణు, ఏఆర్ డీఎస్పీ విజయకుమార్, సైబర్ క్రైమ్ సీఐ హేమంత్ కుమార్, డీసీఆర్బీ సీఐ శ్రీహర్ష, ఆర్ఐ చంద్రశేఖర్‌తో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కొలువుదీరిన కాశీంస్వామి

బత్తలపల్లి: మత సామరస్యానికి ప్రతీకగా నిలిచిన బత్తలపల్లి కాశీంస్వామి కొలువుదీరారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో గూగూడు తర్వాత అంతటి స్థాయిలో ఇక్కడ మొహర్రం వేడుకలు జరుగుతాయి. సోమవారం రాత్రి ముజావర్లు జిలానీ, టైలర్ రియాజ్, మహబూబ్ బాషా, నజరుల్లా, కాశీంవలీలు చావిడిలో ఫాతెహా చేసి అర్ధరాత్రి కాశీంస్వామిని కొలువుదీర్చారు. మంగళవారం నిత్యపూజలు నిర్వహించారు. అదేవిధంగా మండలంలోని గంటాపురం, ముష్టూరు, మాల్యవంతం, రాఘవంపల్లి, యర్రాయపల్లి, లింగారెడ్డిపల్లి, అనంతసాగరం, వెంకటగారిపల్లి తదితర గ్రామాల్లోనూ మొహర్రం వేడుకలను నిర్వహించేందుకు ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఉత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఆయా గ్రామాల్లో గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు సీఐ ఆరోహనరావు, ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. మొహర్రం వేడుకలు నిర్వహించే గ్రామస్తులు తప్పనిసరిగా పోలీస్ స్టేషన్‌లో అనుమతులు తీసుకోవాలని సూచించారు.



బత్తలపల్లిలో కొలువుదీరిన కాశీంస్వామికి ఫాతెహా నిర్వహిస్తున్న ముజావర్లు

టీడీపీ దౌర్జన్యాలను ఎదుర్కొంటాం



బాధితులతో కలిసి పోలీసులతో మాట్లాడుతున్న ఉషశ్రీ చరణ్



స్టేషన్ బయట విలేకరులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఉషశ్రీ చరణ్

- పోలీసులు ఏకపక్షంగా వ్యవహరించడం తగదు
- మాజీ మంత్రి ఉషశ్రీ చరణ్

సోమందేపల్లి: అధికారం అండతో టీడీపీ సాగిస్తున్న అరాచకాలు, దౌర్జన్యాలను న్యాయ పరంగా ఎదుర్కొంటామని మాజీ మంత్రి ఉషశ్రీ చరణ్ అన్నారు. ఈ నెల 1న నాగినాయని చెరువు తండాలో ఒంటరి మహిళ పింఛన్ కోసం వెళ్లిన గీతాబాయిపై టీడీపీ నాయకులు దౌర్జన్యం చేసినా... పోలీసులు కేసు నమోదు చేయకుండా బాధితులపైనే అక్రమ కేసులు బనాయించడం దుర్మార్గమన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఏకపక్షంగా పోలీసులు వ్యవహరించడం తగదని ఆమె హితవు పలికారు. మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ విజయ్‌కుమార్‌ను కలిశారు. గీతాబాయిపై టీడీపీ దౌర్జన్యాలు చేసినా కేసు నమోదు చేయకపోగా, బాధితురాలిపైనే కేసు నమోదు చేయడం ఏమిటని ప్రశ్నించారు. అదే విధంగా గొడవ జరిగిన ప్రాంతంలో లేని ఇద్దరు విద్యార్థులపై కూడా అక్రమంగా కేసు నమోదు చేయడం అన్యాయమన్నారు. అధికారం శాశ్వతం కాదని... ఇలాగే వ్యవహరిస్తే తాము ఆందోళన బాట పట్టి న్యాయస్థానాలను ఆశ్రయిస్తామన్నారు. గీతాబాయిపై దౌర్జన్యం చేసిన టీడీపీ నాయకులు శంకర్ నాయక్, జనార్దన్ తదితరులపై వెంటనే కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే టీడీపీ నాయకులు రోడ్డుపై పింఛన్లు పంపిణీ చేయడంపై అభ్యంతరం వ్యక్తం చేసిన సర్పంచ్ అంజి నాయక్‌పై కూడా కేసు నమోదు చేయడం ఎంత వరకు సమంజసమన్నారు. ఇప్పటికైనా న్యాయం వైపు నిలవాలని, ఒంటరి మహిళ ఇచ్చిన ఫిర్యాదుపై కూడా విచారణ జరిపి టీడీపీ నాయకులపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలన్నారు. బనాయించిన అక్రమ కేసులు తొలగించకుంటే ఆందోళనలు చేపడుతామని పోలీసులకు స్పష్టం చేశారు.

మంత్రి కనుసన్నల్లోనే...
రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వైఎస్సార్ సీపీ శ్రేణులపై దాడులు జరుగుతున్నాయని ఉషశ్రీ చరణ్ అన్నారు. సోమందేపల్లి స్టేషన్ ఆవరణలో ఆమె విలేకరులతో మాట్లాడారు. బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత కనుసన్నల్లో పనిచేస్తున్న పోలీసులు...వైఎస్సార్ సీపీ నాయకులపై అక్రమ కేసుల పరంపరకు తెర లేపారని మండిపడ్డారు. ముఖ్యంగా మండలంలో వైఎస్సార్ సీపీకి మద్దతుగా నిలిచిన ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీ, రెడ్డి సామాజిక వర్గాల నాయకుల ఇళ్లపై దాడులు చేసినా... పోలీసులు ప్రేక్షక పాత్ర వహించారే తప్ప నియంత్రించలేదన్నారు. బాధ్యులపై కనీస చర్యలు తీసుకోలేదన్నారు.

హెడ్ కానిస్టేబుల్‌పై ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు
విచారణ పేరుతో గిరిజన మహిళలు గీతాబాయి, ప్రమీళ బాయి, రాధాబాయిలను అసభ్యంగా మాట్లాడి, అవహేళన చేసిన హెడ్ కానిస్టేబుల్ నాయుడుపై ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు ఉషశ్రీ చరణ్ తెలిపారు. పింఛన్ రోడ్లపై కాకుండా ఇంటివద్దకే వచ్చి ఇవ్వాలని కోరిన ప్రమీళ బాయి, రాధాబాయిలను టీడీపీ నాయకులు దూషించి అక్రమ కేసులు బనాయించారన్నారు. విచారణ పేరుతో హెడ్ కానిస్టేబుల్ వారిని 'సమ్మక్క... సారక్క' అంటూ హేళనగా మాట్లాడటంతో పాటు నైటీలో ఉన్న వారి ఫొటోలు తీయడం గురించి ఎస్టీ కమిషన్‌కు వివరిస్తామన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వెంకటనారాయణరెడ్డి, సర్పంచ్‌లు కిష్టప్ప, జిలాన్ ఖాన్, మాజీ సర్పంచ్‌లు కంబాలప్ప, రవీంద్ర రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు జగదీష్, నరసింహ మూర్తి, ఈశ్వర్, గోపాల్‌రెడ్డి, కళ్యాణ్, రవీంద్ర రెడ్డి, ప్రతాప్, రామాంజి పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్టులో మాక్ డ్రిల్



బాంబు కనిపెట్టడం, నిర్వీర్యం చేయడంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పుట్టపర్తి టౌన్: ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు తీసుకోవాల్సిన చర్యలపై స్థానిక సత్యసాయి విమానాశ్రయంలో మాక్ డ్రిల్ నిర్వహించారు. ప్రమాదకర సంఘటనలు జరిగినప్పుడు వాటికి దీటుగా నిలబడి ఎదుర్కోవడంతో పాటు నిలువరించడంపై ఏఆర్ డీఎస్పీ విజయకుమార్ ఆధ్వర్యంలో ఎయిన్‌పోర్టు సీఐ బొజ్జప్ప, ఆర్ఐ చంద్రశేఖర్ సిబ్బంది మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఇందులో భాగంగా అపరిచిత వ్యక్తులు ఎయిర్‌పోర్టులో బాంబులు పెట్టినప్పుడు వాటిని ఎలా పసిగట్టాలి... ఏ విధంగా నిర్వీర్యం చేయాలన్న విషయాలపై సిబ్బందికి అవగాహన కల్పించారు.



ఎయిర్‌పోర్టు సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న బాంబ్ స్క్వాడ్

క్లుప్తంగా

రేషన్ బియ్యం పట్టివేత



సీజ్ చేసిన వాహనాన్ని చూపుతున్న అధికారులు

అమడగూరు: అక్రమంగా కర్ణాటకకు తరలిపోతున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు, రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ మగ్బూల్‌బాషా తెలిపిన మేరకు.... ముందుగా అందిన సమాచారం మేరకు మారుతీపురం సమీపంలో మంగళవారం ఉదయం రెవెన్యూ అధికారులతో కలసి పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో అటుగా వచ్చిన బొలెరో వాహనాన్ని ఆపి తనిఖీ చేస్తే అందులో 61 బస్తాల్లో 3 టన్నుల బియ్యాన్ని గుర్తించారు. కొలిమిరాళ్లపల్లికి చెందిన సుధాకర్ ఎలాంటి ఆధారాలు లేకుండా రేషన్ బియ్యాన్ని కర్ణాటకకు తరలిస్తున్నట్లుగా నిర్ధారణ అయింది. దీంతో వాహనాన్ని సీజ్ చేసి, సుధాకర్‌తో పాటు బిళ్లూరుకు చెందిన వ్యాపారి రవి, డ్రైవర్ బాబాని అరెస్ట్ చేశారు. కార్యక్రమంలో ఆర్‌ఐ ఈశ్వరయ్య, జమేదారు సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా రైతు ఆత్మహత్య



మృతురాలు శివలక్ష్మి

బత్తలపల్లి: పంటల సాగుకు చేసిన అప్పులు తీర్చే మార్గం కానరాక మహిళా రైతు ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... బత్తలపల్లి మండలం ఈదుల ముష్టూరుకు చెందిన బత్తిని బత్తినన్న, శివలక్ష్మి (33) దంపతులకు ఓ కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. తమకున్న రెండు ఎకరాల పొలంలో వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఈ క్రమంలో పంటల సాగుకు దాదాపు రూ.5 లక్షల వరకూ అప్పులు చేశారు. ఏటా పెట్టుబడుల భారం పెరగడమే తప్ప ఆశించిన స్థాయిలో పంట దిగుబడులు రాక వడ్డీల భారం పెరిగింది. ఈ ఖరీఫ్‌లో మంచి వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ చేసిన సూచనలతో ఈసారైనా అప్పులు తీరుతాయని భావించారు. అయితే ఇప్పటి వరకూ చినుకు జాడ లేకుండా పోయింది. దీంతో భవిష్యత్తు తలుచుకుని భయపడిన శివలక్ష్మి... జీవితంపై విరక్తితో సోమవారం పురుగుల మందు తాగింది. అపస్మారక స్థితిలో పడి ఉన్న ఆమెను కుటుంబసభ్యులు వెంటనే అనంతపురంలోని ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్సకు స్పందించక సోమవారం రాత్రి ఆమె మృతి చెందింది. మృతురాలి తల్లి రమణమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు.

మహిళా విద్యకు వెన్నుదన్ను

- జిల్లాలోనే ఏకైక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల
- అన్నింటా అగ్రగామి
- వసతి సదుపాయంతో విద్యాబోధన
- రేపు న్యాక్ పీర్ కమిటీ పర్యటన



హిందూపురంలోని ఎస్‌ఎస్‌పీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల



కంప్యూటర్ ల్యాబ్



కళాశాలలోని సైన్స్‌ల్యాబ్

హిందూపురం: జిల్లాలోనే ఏకైక మహిళా డిగ్రీ కళాశాలగా ఖ్యాతి గాంచిన హిందూపురంలోని ఎస్‌ఎస్‌పీఆర్ డిగ్రీ కళాశాల నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్ (న్యాక్) పరిశీలనకు సిద్ధమైంది. ఈ నెల 11, 12 తేదీల్లో కళాశాలను న్యాక్ పీర్ కమిటీ సందర్శించనుంది. ఈ నేపథ్యంలో ఎస్‌ఎస్‌పీఆర్ డిగ్రీ కళాశాలలో సందడి ఊపందుకుంది. కళాశాలలో వివిధ అకడమిక్ రికార్డులు, కార్యకలాపాలను పర్యవేక్షించి అక్రిడిటేషన్ స్థాయిని నిర్ణయించనున్నారు. 2016లో న్యాక్ అక్రిడిటేషన్‌లో 2.05 పాయింట్లతో బి గ్రేడ్‌ను ఈ కళాశాల పొందింది. ఈ సారి ఏ ప్లస్ గ్రేడ్ సాధించేలా అడ్మిష్టేషన్, విద్యాభివృద్ధి తదితర అంశాలను మెరుగు పర్చుకుని ప్రగతి పథంలో మహిళా కళాశాల దూసుకెళుతోంది. 1987లో కేవలం 52 మంది విద్యార్థినులతో ఎంజీఎం పాఠశాలలో ఆవరణలో మొదలైన కళాశాల 2004 నాటికి త్యాగరాజనగర్ ఆర్టీసీ కాలనీలో సొంత భవనంలోకి మారింది. ప్రస్తుతం ఈ కళాశాలలో 900 మంది విద్యార్థినులు అన్ని విధాలుగా విద్యా నైపుణ్యాలు గడిస్తున్నారు.

అన్నింటా ముందజ

అత్యధిక అడ్మిషన్లతో జిల్లాలోనే ఎస్‌ఎస్‌పీఆర్ మహిళా డిగ్రీ కళాశాల ముందుజలో ఉంటోంది. అదే స్థాయిలో ఫలితాలూ సాధిస్తోంది. క్రీడలు, సాంస్కృతిక, ఉన్నత విద్యల్లో ప్రవేశాలు, ఉద్యోగాల సాధనలో కళాశాల విద్యార్థినులు ప్రత్యేకతను చాటుకుంటున్నారు. ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్ కార్యక్రమాల ద్వారా సమాజ సేవ, స్వీయ క్రమశిక్షణ పొంది ఉత్తమ పౌరులుగా ఎదుగుతున్నారు. పాఠ్యాంశాల బోధన, కెరియర్ గైడెన్స్, ప్లేస్‌మెంట్ డ్రైవ్‌పై అధ్యాపకులూ ప్రత్యేక దృష్టి సారించి ఆ దిశగా విద్యార్థినులను సన్నద్ధం చేస్తున్నారు. ఈ క్రమంలో ఇటీవల చేపట్టిన క్యాంపస్ డ్రైవ్‌లో కళాశాలకు చెందిన 78 మంది విద్యార్థులకు ఉన్నత శ్రేణి ఉద్యోగాలు దక్కాయి. గత ఏడాది గ్రూప్ వన్ పరీక్షల్లోనూ ఎనిమిదవ ర్యాంక్‌తో డిప్యూటీ కలెక్టర్ పోస్టుకు విద్యార్థిని స్వాతి అర్హత సాధించింది. ఈ కళాశాలలో చదువుకున్న చాలా మంది అధ్యాపకులుగా, ఉపాధ్యాయులుగా జీవితంలో స్థిరపడ్డారు. మరికొందరు బ్యాంకింగ్, ఎగ్జిక్యూటివ్, పోలీసు, సచివాలయ శాఖల్లో ఉద్యోగాలు దక్కించుకున్నారు. విద్య వైజ్ఞానిక యాత్రలో భాగంగా ప్రతిష్టాత్మకమైన ఐఐసీటీ, ఐఐఎస్సీ మొదలైన సంస్థలను సందర్శించి, అక్కడి శాస్త్రవేత్తలో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొనేలా అవకాశాలు కల్పిస్తున్నారు. కళాశాలలోని ల్యాబ్‌లో 70 కంప్యూటర్లను ఏర్పాటు చేశారు. అత్యాధునిక సౌకర్యాలతో కూడిన ప్రయోగశాలలు, డిజిటల్ క్లాస్ రూమ్‌లు, పదివేల రిఫరెన్స్‌లు, సబ్జెక్టు పుస్తకాలతో పాటు వివిధ మ్యాగజైన్లు, దినపత్రికలు, ఈ–జర్నల్స్‌తో కూడిన విశాలమైన గ్రంథాలయం అబ్బుర పరుస్తోంది. కళాశాల ప్రాంగణం మొత్తం పచ్చని మొక్కలతో ఆహ్లాదాన్ని పంచుతోంది.

విద్యార్థినుల పర్యవేక్షణలోనే వసతి గృహం

కళాశాలకు అనుబంధంగా విద్యార్థినుల పర్యవేక్షణలోనే వసతి గృహం నడుస్తోంది. దాదాపు 200 మంది విద్యార్థినిలు ఇక్కడ వసతి పొందుతున్నారు. సోలార్ వాటర్ హీటర్, ఆర్వో సిస్టంతో తాగునీటి సౌకర్యం ఉంది. సీసీ కెమెరాల నిరంతర నిఘా మధ్య విద్యార్థినులకు భద్రత కల్పించారు. విదేశాల్లో స్థిరపడ్డ దాత తిరుమలేష్ కళాశాలపై అభిమానంతో గత పదేళ్లుగా మధ్యాహ్న భోజన సదుపాయం కల్పిస్తున్నారు. రోజు దాదాపు 150 నుంచి 200 మంది విద్యార్థులు లబ్ధి పొందుతున్నారు. రోజూ యోగాతో పాటు వ్యాయమం, కరాటే వంటి ఆత్మ సంరక్షణ అంశాలపై ప్రత్యేకంగా శిక్షణ ఇస్తున్నారు. జాతీయస్థాయి క్రీడల్లోనూ ఈ కళాశాల విద్యార్థులు రాణిస్తున్నారు. కళాశాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ పీఎం ఉష పథకం ద్వారా రూ.5 కోట్ల నిధులు మంజూరు చేసింది. ఈ క్రమంలో ఈ సారి న్యాక్‌లో ఏ ప్లస్ గ్రేడ్ సాధిస్తే కళాశాల అభివృద్ధికి మరిన్ని నిధులు సమకూరే అవకాశాలున్నాయి.

పూర్వ విద్యార్థిని సన్మానించిన 'నవోదయ' అధ్యాపకులు



విష్ణుతేజ్‌ను సన్మానిస్తున్న అధ్యాపకులు, పూర్వ విద్యార్థులు

లేపాక్షి: స్థానిక జవహర్ నవోదయ విద్యాలయ పూర్వ విద్యార్థి, అమెరికాలో చదువుకుంటున్న విష్ణుతేజ్‌ను మంగళవారం విద్యాలయ అధ్యాపకులు, పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. అనంతపురం జిల్లా నార్పలకు చెందిన విష్ణుతేజ్ అమెరికాలోని ఫాజిల్ రిజ్ హైస్కూల్‌లో చదువుకుంటున్నాడు. ఈ క్రమంలో సెలువుపై సొంతూరికి వచ్చిన విషయం తెలుసుకున్న పూర్వ విద్యార్థుల కోరిక మేరకు మంగళవారం నవోదయ విద్యాలయను సందర్శించి, పలు అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. రోబోటిక్స్ అండ్ స్టెం ప్రజెంటేషన్ అంశంపై విద్యార్థి ఇచ్చిన పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ విద్యార్థుల్లో ఆలోచన శక్తిని రేకెత్తించింది. ఇందుకు కృతజ్ఞతగా విష్ణుతేజ్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాగరాజు, అధ్యాపకులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

యువకుడి బలవన్మరణం



మృతుడు పవన్‌కుమార్

ధర్మవరం రూరల్: మండలంలోని పోతుకుంట బృందావన కాలనీకి చెందిన పవన్ కుమార్(25) ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... యర్రప్ప, రామలక్ష్మమ్మ దంపతుల కుమారుడు పవన్‌కుమార్ ట్రాక్టర్ డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల తాగుడుకు బానిస కావడంతో మద్యం కొనుగోలుకు తెలిసిన వారందరి వద్ద అప్పులు చేస్తూ వచ్చాడు. అప్పుల భారం పెరగడంతో తల్లిదండ్రులు మందలించారు. దీంతో క్షణికావేశానికి లోనైన పవన్‌కుమార్ మంగళవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఫ్యాన్ కొక్కికి చీరతో ఉరి వేసుకున్నాడు. ఆలస్యంగా విషయాన్ని గుర్తించిన కుటుంబసభ్యులు వెంటనే ధర్మవరంలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే పవన్‌కుమార్ మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు హెడ్ కానిస్టేబుల్ మారెప్ప తెలిపారు.

మున్సిపల్ ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జయచంద్రారెడ్డి

ధర్మవరం అర్బన్: మున్సిపల్ యాజమాన్య పరిధిలోని పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శెట్టిపి జయచంద్రారెడ్డి డిమాండ్ చేశారు. ధర్మవరంలోని లక్ష్మీచెన్నకేశవపురం మున్సిపల్ ఉన్నత పాఠశాలలో మంగళవారం యూటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్సిపల్ ఉపాధ్యాయుల పీఎఫ్ సమస్య, నూతన అప్‌గ్రేడ్ అయిన ఉన్నత పాఠశాలల్లో పోస్టుల కేటాయింపు, బదిలీలు, ప్రమోషన్లు, మున్సిపల్ పాఠశాలల్లో పెరుగుతున్న విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పోస్టుల సర్దుబాటు, జీఓ 117 రద్దు తదితర అంశాలపై ప్రభుత్వం స్పందించాలన్నారు. 2016లో ఇచ్చిన మున్సిపల్ ఉపాధ్యాయుల సర్వీస్ రూల్‌ను సవరణ చేస్తూ విద్యాశాఖ జీఓ 7, 8, 9, 10ను విడుదల చేసిందని గుర్తు చేశారు. ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో బదిలీలు, ప్రమోషన్లు ప్రక్రియ నిలిచిపోయిందన్నారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న పీఎఫ్ సమస్య ఇప్పటికీ పరిష్కారానికి నోచుకోలేదన్నారు. నూతన మున్సిపాలిటీ పరిధిలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలను కూడా మున్సిపల్ పాఠశాలలుగానే గుర్తించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ఆడిట్ కమిటీ సభ్యుడు రామకృష్ణనాయక్, పట్టణ అధ్యక్షుడు హరికృష్ణ, ప్రధాన కార్యదర్శి సాయిగణేష్, సీనియర్ నాయకులు లక్ష్మయ్య, రాంప్రసాద్, రామంజినేయులు, హరిశంకర్, ఆంజనేయులు, మొహినుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

'సంస్కృతి' విద్యార్థులకు ఉద్యోగాలు



ఉద్యోగాలు దక్కించుకున్న విద్యార్థులతో సంస్కృతి కళాశాల యాజమాన్యం

పుట్టపర్తి అర్బన్: జిల్లా కేంద్రంలోని సంస్కృతీ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ 16 మంది విద్యార్థులు ప్రతిభ చాటి ప్రముఖ ఐటీ కంపెనీలో ఉద్యోగాలు దక్కించుకున్నారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల యాజమాన్యం అభినందించింది. మంగళవారం ఆ కళాశాలల చైర్మన్ విజయభాస్కరరెడ్డి మాట్లాడుతూ.. రెండు రోజుల క్రితం బెంగళూరుకు చెందిన ప్రముఖ ఐటీ కంపెనీ '24/7 ఏఐ' నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌లో కళాశాలకు చెందిన 250 మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. మొత్తం రెండు రౌండ్ల ఇంటర్వ్యూలను కంపెనీకి చెందిన హెచ్‌ఆర్ దివ్య, శ్రీకన్య నిర్వహించి 16 మంది విద్యార్థులకు ఉద్యోగాలకు సంబంధించిన ఆఫర్ లెటర్లను అందజేసినట్లు తెలిపారు. సత్యసాయి బాబా ఆశీస్సులతో ప్రతి విద్యార్థి ఉద్యోగాన్ని సాధించేలా తమ కళాశాలలో తీర్చిదిద్దుతున్నామని, దీనికి విద్యార్థుల కృషి కూడా తోడవడంతో ఆశించిన మేర ఫలితాలు సాధిస్తున్నట్లు డీన్ డాక్టర్ బాలకోటేశ్వరి తెలిపారు. ఎంపికైన 16 మంది విద్యార్థులకు రూ.4.5 లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగాలు దక్కాయన్నారు. 2024–25లో తొలి విడతలోనే ఉన్నత శ్రేణి ఉద్యోగాలు దక్కడంపై హర్షం వ్యక్తం చేశారు. త్వరలో మరిన్ని కంపెనీలు క్యాంపస్ డ్రైవ్ చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నాయని, ఈ క్రమంలో విద్యార్థులందరికీ ఉద్యోగాలు దక్కేలా ప్రత్యేకంగా శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు.

ఫార్మసీ విద్యార్థినికి జాతీయ స్థాయి అవార్డు



విద్యార్థిని ఫాతిమా జోహ్రాను అభినందిస్తున్న అధ్యాపకులు

హిందూపురం: స్థానిక మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లొమా ఇన్ ఫార్మసీ (డీ–ఫార్మసీ) చదువుతున్న ఎస్.ఫాతిమా జోహ్రా జాతీయ స్థాయిలో అందించే కేకే ఆచార్జీ అవార్డును అందుకున్నారు. ఈ మేరకు ఆ కళాశాల ప్రిన్సిపాల్ ఎన్.హరీష్‌బాబు మంగళవారం తెలిపారు. ఏటా డీ–ఫార్మసీలో అత్యుత్తమైన మార్కులు సాధించిన వారికి జాతీయ స్థాయిలో కేకే ఆచార్జీ అవార్డులు అందజేస్తారన్నారు. ఈ క్రమంలో 2023–24 విద్యాసంవత్సరానికి గాను 96.14 శాతం మార్కులు సాధించి ద్వితీయ స్థానంలో నిలిచిన ఎస్.ఫాతిమా జోహ్రాకు అవార్డు దక్కింది. హైదరాబాదులో ఈ నెల 5 నుంచి 7వ తేదీ వరకూ న్యూఢిల్లీ ఇండియన్ హాస్పిటల్ ఫార్మసిస్ట్ అసోసియేషన్ నిర్వహించిన 73వ ఐపీసీ–2024 కాన్ఫరెన్స్‌లో అవార్డుతో పాటు రూ.5వేల నగదు, జ్ఞాపికను ఆమె అందుకుంది. దీంతో మంగళవారం కళాశాలలో విద్యార్థిని ప్రిన్సిపాల్ హరీష్‌బాబు, అధ్యాపకులు అభినందించారు.

జీవిత బీమా పరిహారం పేరుతో మోసం

బెళుగుప్ప: జీవిత బీమా పరిహారం పేరుతో బాధిత కుటుంబసభ్యుల నుంచి నగదును సైబర్ నేరగాళ్లు అపహరించారు. మృతుడిసోదరుడు చిన్నతిప్పేస్వామి తెలిపిన మేరకు... బెళుగుప్ప మండలం నక్కలపల్లికి చెందిన తిప్పేస్వామి (44) మూడు రోజుల క్రితం మృతిచెందాడు. ఆయన మృతి నుంచి కుటుంబసభ్యులు ఇంకా కోలుకోలేదు. మంగళవారం ఉదయం గ్రామానికి చెందిన వ్యక్తికి ఓ వ్యక్తి 7975190159 నంబర్ ద్వారా ఫోన్ చేసి తాను డీఎస్పీనని పరిచయం చేసుకున్నాడు. మూడు రోజుల క్రితం చనిపోయిన వడ్డే తిప్పేస్వామికి రూ. 8 లక్షల జీవిత బీమా పరిహారం మంజూరైందని, అయితే జీఎస్టీ కింద రూ.18,500 చెల్లించిన వెంటనే పరిహారం అందుతుందని నమ్మబలికాడు. సదరు వ్యక్తి ద్వారా విషయం తెలుసుకున్న చిన్న తిప్పేస్వామి రూ.18,500ను 96111 56511కు ఫోన్ ద్వారా చెల్లించాడు. అనంతరం అవతలి వ్యక్తి నుంచి ఎలాంటి స్పందన లేకుండా పోయింది. దీంతో తాము మోసపోయినట్లు నిర్ధారించుకుని వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అక్కపై గొడ్డలితో దాడి



గాయపడిన షకూన్‌బీ

గార్లదిన్నె: ఇంటి స్థల వివాదంలో సొంత అక్క, ఆమె కుమార్తెపై ఓ వ్యక్తి గొడ్డలితో దాడి చేశాడు. పోలీసులు తెలిపిన మేరకు... గార్లదిన్నె మండలం పెనకచెర్ల డ్యాం గ్రామంలో నివాసముంటున్న షేక్ జిలాన్ బాషాకు కొంత కాలంగా కుటుంబసభ్యులతో ఆస్తి వివాదం నడుస్తోంది. ఈ క్రమంలో మంగళవారం ఉదయం ఇంటి వద్ద స్థలం విషయమై అక్క మహబూబ్‌బీతో జిలాన్‌బాషా ఘర్షణ పడ్డాడు. ఆ సమయంలో తీవ్ర ఆవేశానికి లోనైన జిలాన్ గొడ్డలితో అక్కపై దాడి చేశాడు. ఆ సమయంలో అక్కడే ఉన్న మహబూబ్‌బీ కుమార్తె షకూన్‌బీ అడ్డుకోబోయింది. దీంతో ఆమెపై కూడా గొడ్డలితో దాడి చేశాడు. చుట్టుపక్కల వారు అడ్డుకుని క్షతగాత్రులను వెంటనే అనంతపురంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాసలాన్ని సందర్శించి, బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. దాడికి పాల్పడిన జిలాన్‌ను అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ మహమ్మద్ గౌస్ తెలిపారు.

• విదేశీ అతిథుల రాక



జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదురుగా ఉన్న చెరువులో విదేశీ పక్షుల సందడి నెలకొంది. ఏటా సంతానోత్పత్తిలో భాగంగా విదేశీ పక్షులు జిల్లాకు రావడం పరిపాటిగా మారింది. ఈ క్రమంలో మంగళవారం అనంతపురం మీదుగా వెళుతూ కాసేపు చెరువులో విశ్రమించాయి. గూడముక్కు కొంగలు, ఫ్లెమింగోలుగా వీటిని పిలుస్తుంటారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



ద్విచక్ర వాహన దొంగల అరెస్ట్



స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలను చూపుతున్న పోలీసులు

ధర్మవరం అర్బన్: ద్విచక్ర వాహనాలను అపహరించుకెళుతున్న దొంగలను అరెస్ట్ చేసి, 12 వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు వన్‌టౌన్ సీఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. వివరాలను మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వెల్లడించారు. కూలి పనులతో జీవనం సాగిస్తున్న గుర్రంపాటి రాకేష్ రణదీప్ (రాకీ), మేకల నరసింహులు, నీలి సతీష్‌కుమార్ వ్యసనాలకు బానిసై సులువుగా డబ్బు సంపాదించేందుకు ద్విచక్ర వాహనాల అపహరణకు తెరదీశారు. ఈ క్రమంలో ధర్మవరంలోని పలు వార్డుల్లో సంచరిస్తూ ఇళ్ల ఎదుట నిలిపిన ద్విచక్ర వాహనాలను గుర్తించి, అర్ధరాత్రి దాటిన తర్వాత అపహరించుకెళ్లేవారు. ఆయా ఘటనలపై కేసు నమోదు చేసిన పోలీసులు పక్కా ఆధారాలతో శివానగర్ శివాలయం సమీపంలోని పాడుబడిన ఇంటి వద్ద మంగళవారం రాకేష్ రణదీప్, సతీష్‌కుమార్‌ను అరెస్ట్ చేశారు. వీరి నుంచి 12 ద్విచక్రవాహనాలు, కటింగ్ ప్లేయర్, వైర్ కట్టర్‌ను స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న నరసింహులును త్వరలో అరెస్ట్ చేయనున్నట్లు పోలీసులు తెలిపారు. నిందితుల అరెస్ట్‌లో చొరవ చూపిన సిబ్బందిని డీఎస్పీ శ్రీనివాసులు అభినందించారు.

ఆర్యవైశ్య విద్యార్థులకు అవార్డులు

అనంతపురం కల్చరల్: ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఆర్యవైశ్య విద్యార్థులకు అవార్డులు అందజేయనున్నట్లు అవోపా ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షుడు జయంతి శ్రీనివాసులు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 8వ తరగతి నుంచి పీజీ వరకూ చదువుకున్న వారి ప్రతిభ ఆధారంగా అవార్డుల ప్రదానం ఉంటుంది. ఆసక్తి కల్గిన విద్యార్థులు ఈ నెల 10 నుంచి ఆగస్టు 15వ తేదీలోపు అనంతపురంలోని రాజు రోడ్డులో ఉన్న అవోపా కార్యాలయంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంటలోపు దరఖాస్తులను అందజేయాలి. పూర్తి వివరాలకు 94907 27460లో సంప్రదించవచ్చు.

వరుస చోరీలతో బెంబేలు

- నిఘా వ్యవస్థ పూర్తిగా విఫలం
- పట్టపగలే చెలరేగుతున్న దుండగులు
- బదిలీ మోజులో విధులపై పోలీసుల నిర్లక్ష్యం

హిందూపురం అర్బన్: జిల్లా ఇటీవల వరుస చోరీలతో ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. రాత్రి, పగలు తేడా లేకుండా దొంగలు రెచ్చిపోతున్నారు. రెండు రోజుల క్రితం గోరంట్లలో రెండు ఇళ్లలో చొరబడిన దుండగులు బంగారం, నగదు అపహరించుకెళ్లారు. సోమవారం మధ్యాహ్నం మడకశిరలోని శాంతినగర్ లో నివాసముంటున్న చంద్రశేఖర్ రెడ్డి, తన కుటుంబసభ్యులతో కలసి ఆలయానికి వెళ్లి వచ్చేలోపు ఇంటి తలుపులు బద్దలుగొట్టి రూ.1.40 లక్షల నగదు, 65 గ్రాముల బంగారు నగలు దోచేశారు. 10 రోజుల క్రితం కొడికొండ చెక్‌పోస్టులో దుకాణం నిర్వహిస్తున్న మహిళ మెడలోని గొలుసును ఓ ద్విచక్ర వాహనదారుడు లాక్కొని ఉడాయించాడు. తాజాగా మంగళవారం మధ్యాహ్నం చిలమత్తూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని మరువకొత్తపల్లి బీసీ కాలనీలో నివాసముంటున్న మద్దిగిరేపల్లి శంకరరెడ్డి ఇంట్లో చోరీ జరిగింది. ఇంటి యజమానురాలు స్నానానికి వెళ్లి సమయంలో బాత్‌రూమ్ గదికి బయట నుంచి గడియ పెట్టి దుండగులు ఇంట్లోకి చొరబడ్డారు. బీరువాలో ఉంచిన 10 తులాల బంగారు నగలు అపహరించుకెళ్లారు.

బదిలీలపైనే శ్రద్ధ..

అసాంఘిక శక్తుల ఆట కట్టించాల్సిన పోలీసులు తమ విధులను మరిచి బదిలీలపై దృష్టి సారించారు. ఈ క్రమంలో ఎవరికి వారు సెలువు పెట్టి నాయకులను ప్రసన్నం చేసుకునేందుకు పైరవీలు ముమ్మరం చేశారు. ఇదే అదనుగా భావించిన దుండగులు వరుస చోరీలతో చెలరేగిపోతున్నారు. జిల్లా వ్యాప్తంగా సీఐలు, ఎస్‌ఐలు తమకు అనుకూలమైన ప్రాంతాలకు బదిలీ చేయించుకునేందుకు సిద్ధమవుతుండగా... కింది స్థాయి సిబ్బంది తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో దొంగలు పట్టపగలే చోరీలకు పాల్పడి ఉన్నదంతా ఊడ్చేస్తున్నారు.

కేసుల ఛేదనలో కనిపించని పురోగతి

చోరీ కేసుల ఛేదనలో పోలీసులు వెనుకబడుతున్నారనే ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి. నిఘా వ్యవస్థ పూర్తిగా విఫలం కావడంతో ఇటీవల జరిగిన దొంగతనాల్లో ఒక్కటంటే ఒక్క కేసు కూడా ఛేదించలేదని పలువురు ఆరోపిస్తున్నారు. దీంతో దొంగలు పట్టపగలే రెచ్చిపోతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఇంటికి తాళం వేసి వెళ్లాలంటేనే ప్రజలు భయపడుతున్నారు. కేసు నమోదు వరకే పరిమితమవుతూ ఆ తర్వాత చేపట్టాల్సిన చర్యలను పోలీసులు పూర్తిగా విస్మరించారన్న విమర్శలు వినపడుతున్నాయి. కేసుల విచారణను సీరియస్‌గా తీసుకోవడం లేదని, వరుస చోరీలు జరుగుతున్నా పెట్రోలింగ్ వ్యవస్థను బలోపేతం చేయడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

పట్టపగలే బంగారం చోరీ

చిలమత్తూరు: మండలంలోని మరవకొత్తపల్లి బీసీ కాలనీకి చెందిన శంకర్‌రెడ్డి ఇంట్లో మంగళవారం పట్టపగలే చోరీ జరిగింది. మధ్యాహ్నం శంకర్‌రెడ్డి ఇంట్లోకి చొరబడి దుండగులు 10 తులాల బంగారు నగలు అపహరించుకెళ్లారు. ఇంటి బయట ఉన్న బాత్‌రూంలో స్నానానికి వెళ్లిన బాధితుడి భార్య తిరిగి వచ్చి చోరీ విషయాన్ని గుర్తించి సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు సీఐ ఈరన్న తెలిపారు.

చర్యలు తీసుకుంటాం

రెండు రోజుల్లో మడకశిర, పెనుకొండ, మంగళవారం చిలమత్తూరు మండలం మరవకొత్తపల్లిలోని బీసీ కాలనీలో పట్టపగలు చోరీలు జరిగాయి. ఈ తరహా నేరాలకు పాల్పడేవారి వివరాలు సేకరించాం. చోరీలకు పాల్పడుతున్నవారిని అరెస్ట్ చేస్తాం. గస్తీ పెంచి చోరీలు జరగకుండా చర్యలు తీసుకుంటాం.

– కంజాక్షన్, డీఎస్పీ, హిందూపురం